లోకంలో ఎవరి కష్టసుఖాలు వారివి. ఒకరి కష్టసుఖాలలో పాలు పంచుకొనడం అవివేకమని అనుభవం చెబుతుంది. అందుకు సిద్ధపడేవారు కొత్త బాధలు భరించక తప్పదు.

---

**నాకు** మధుసూధనంతో పెద్ద పరిచయం లేదు. కాని క్రొత్త ప్రదేశంలో ముఖ పరిచయస్తులు కనబడినా త్వరలోనే ఆప్తులు కాగలుగుతారు. అలాగే అయింది మా పని. తరచు వాళ్ళింటికి వెళ్ళుతుండేవాడిని. ఈమధ్య మరీ రోజా వెళ్ళుతున్నాను. కాని మధుసూదనం వాళ్ళింటికి అలా వెళ్ళటం మనస్ఫూర్తిగా ఆలోచిస్తే వాడిని కలుసుకోవటానికి మాత్రం కాదని నాకు తెలుసు....

• • •

ఇదంతా మధుసూదనం కథ. వాడే నాకు చెప్పాడు....కాని అది చెప్పందే నేను వాళ్ళింటికి





# పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డు పైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము/ విధి విక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు.—1—25 లకు మాత్రము వి. పి. గా పంపగలము వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయవిధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా మండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW) Jullundur City**


## 18 మూలికలతో తయారుచేయబడిన ప్రప్రథమ



## ఆయుర్వేదిక

### పేస్టు మరియు పౌడరు

మామూలుగా శుభ్రపరచటమంటే ఏ పేస్టైనా పౌడరైనా చేయగలదు కాని, చిగురులను వృద్ధి పరచే వస్తువులు వాటిలో ఉన్నవా అని ఆలోచించ దారా ప్రప్రథమ ఆయుర్వేదిక 'వికో వజ్రదంతి (పేస్టు మరియు పౌడరు) లోగల 18 మూలికలు మీ చిగుళ్లను గుణపరచి. పళ్లను గట్టిగానుంచును తొలిసారి ఉపయోగములోనే సంతృప్తినిచ్చును

## వికో వజ్రదంతి

### పేస్టు మరియు పౌడరు







**Vicco Laboratories Private Limited**
DADAR T.T.-BOMBAY-14.

# ఆ రోజు...రాత్రి...

ఎందుకు వెళుతున్నదీ మీకు అర్థం కాదు...

• • •

మధుసూదనం హడావుడిగా కారు వద్దకు నడిచి తలుపుతెరిచి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. కారుగేటు దాటి 'రంయ్' మంటూ జారిపోతున్నది. హెడ్‌లైట్ల కాంతిలో నల్లటి తారు రోడ్డు వికృతంగా మెరుస్తున్నది.

హైదరాబాదు మహానగరంలోని ఆకాశాన్నంటే మేడలు, వింత కాంతులతో వెలిగే రకరకాల దుకాణాలు, మెయిన్ రోడ్లు, ఇళ్ళు, పార్కులు, మూసీనది.....ఒక్క క్షణం కనబడి మాయమయిపోతున్నాయి....

మరి కొంతసేపటికే నిర్మానుష్యమయిన ఒంటరి రోడ్డుమీద పయనించ సాగిందా కారు.

మధుసూదనం గంట చూచుకున్నాడు. తొమ్మిది గంటలు. తను ఒంటి గంటకన్నా గుంటూరు చేరుకోగలడా?...కాని...తన విమల ...విమలను తను చూడగలుగుతాడా?

గుబురుగా పెరిగిన చింతచెట్లు భయంకరంగా ఉన్నాయి. అమావాస్యను బోలే చీకటి. వాన త్వరలోనే రాబోతుం దనడానికి సూచనగా చల్లని గాలి, ఒక్క నక్షత్రమయినా కనబడకుండా ఆకాశాన్ని కప్పివేసిన నల్లని మబ్బులు —ఆ దృశ్యం మధుసూధనాన్ని భయవిహ్వలుణ్ణి చేసింది.

ఏమీ తెలియని మత్తులోపడి ఉన్న విమల... చుట్టూ డాక్టరు...నర్సులు....ఆస్పత్రికి తెల్లటి గోడలు.. .మధుసూదనానికి చిరుచెమట పట్ట సాగింది.

దట్టమైన చెట్లలో కీచురాళ్ళ రొద. ఎక్కడెక్కడో పేరు తెలియని జంతువుల అరుపులు. ఉండి ఉండి ఆకాశంలో మనస్సుకు దడ పుట్టించేలా ఉరుములు, కళ్ళు మిరిమిట్లు గొలిపే మెరుపులు..

మధుసూదనం మనస్సు పూర్తిగా విమల ముందే తిరుగుతున్నది ....పండంటి పసిపాపను ఎత్తుకొని తర్వలోనే వస్తానని పుట్టింటికి బయల్దేరివెళ్ళిన విమల ఎదుట నిలబడి పలకరిస్తున్నది.....ఆ అందమైన కళ్ళు, విశాలమైన ముఖంలో చిన్న నోరు, గులాబి రంగు చెక్కిళ్ళు, ఎర్రని కుంకుమ బొట్టు....తన విమల...విమల కెలా ఉన్నదో?

ఎక్కడో పిడుగు పడిం దనేందుకు నిదర్శనంగా భయంకరంగా గుండె కలుక్కుమనేలా ఉరిమింది. కళ్ళు మూతలు పడేలా మెరిసింది. అనుకోకుండా కాలు బ్రేకును నొక్కింది—తిరిగి తేరుకొని తన మామూలు స్పీడులో కారును పోనివ్వ సాగాడు.

విమల, తన విమలయై రెండు సంవత్సరా

లన్నా కాలేదు. తన జీవితంలో ఎన్నడూ అనుభవించని ఆనందం, అనుభూతి ఈ రెండు సంవత్సరాల్లో అనుభవించాడు....అలాంటి విమల ఈ రోజు తన వంశవృక్షాన్ని అభివృద్ధి చేయబోయి తనే అపాయం తెచ్చుకుంది! మామగారు ఇచ్చిన టెలిగ్రాంలోని అక్షరాలు అతడిని వెక్కిరిస్తూ కళ్ళముందు కదులుతున్నాయి. 'విమల సీరియస్—స్టార్ట్ యిమీడియట్లీ!'

జోరున వాన మొదలుపెట్టింది. గాలి ప్రమోత ఎక్కువయింది. మధుసూదనం కారు అద్దాలు మూశాడు. ఆ కారు లైట్ల కాంతిలో స్వచ్ఛమైన సిమెంటు రోడ్డుమీద పడుతున్న నీటి బిందువులు ముత్యాలను సృష్టిస్తున్నాయి. చలిగా ఉంటే కారు వేగం తగ్గించి సిగరెట్టు కేసునుంచి తీసి పెదిమలమధ్య పెట్టుకొని లైటరు వెలిగించి గుప్పున పొగ వదిలాడు.... ఆ పొగలోనూ తనకు విమలే కనబడుతున్నది!

పన్నెండు గంటలయినా వాన తగ్గే సూచన లేమీ కనబడలేదు. ఆకాశంలోకి తొంగిచూస్తే మిగిలేది నిరాశా నిస్పృహలే!

ఈ వాన మూలకంగా తను గంట వెనుక పడిపోయాడు. లేకపోతే ఈపాటికి ఇంకో యాభై మైళ్ళన్నా పోయి ఉండేవాడు. ప్రయాణం ఆలస్యం అవుతున్నకొలదీ మనస్సులో ఆరాటం హెచ్చుతున్నది.

కలత చెందిన మనస్సుతో అలాగే నీటి ధారలతో నిండిపోతున్న రోడ్డును చూస్తూ స్టీరింగ్‌ను అతి జాగ్రత్తగా త్రిప్పుతున్నాడు మధుసూదనం.

దూరాన ఏదో గ్రామ మున్నట్లుగా మిణుకు మిణుకు మంటూ లైట్లు కనబడుతున్నాయి. ఆ జోరున వానలో, చిమ్మ చీకట్లలో ఆ వెలుగుతున్న దీపాలు నక్షత్రాలను గుర్తుకు తెస్తున్నాయి. వాటిని, రోడ్డును మార్చి మార్చి చూస్తూ సిగరెట్టు పొగలను వదలుతున్నాడు.

ఆ మిణుకు మిణుకు మనే దీపాలు నిమిష నిమిషానికి దగ్గరవుతున్నాయి. ఆ కారు చిన్నగా ఉరవళ్ళు పరవళ్ళతో పారుతున్న నీటితో నిండిన వంతెన దాటింది. తరువాత విశాలమైన మర్రిచెట్టు. మళ్ళీ ఫర్లాంగువరకు చెట్టు లేదు. ఒక తాటితోపు దాటిపోయింది. కళ్ళు ఎత్తిచూస్తే ఒళ్ళు గగుర్పొడిచింది. దృష్టి మరల్చాడు. చింతచెట్లు రోడ్డుమీద చీకటి దుప్పటిలా ముసుగువేసినయి. మలుపువస్తే బ్రేకువేసి వేగం తగ్గించి త్రిప్పాడు.

అలా పూర్తిగా మలుపుతిరిగి రోడ్డుమీదకు దృష్టి సారించేటప్పటికి ఒక వింత దృశ్యం కళ్ళముందు కనబడింది! దూరంగా ఒక వ్యక్తి రోడ్డు కడ్డంగా ఆ వానలో తడిసి ముద్దవుతూ లాంతరు పట్టుకొని కారును ఆపమన్నట్లుగా చేయూపుతూ నిలబడి ఉన్నాడు!

మధుసూదనం రెండు మూడుసార్లు బలంగా హారన్ నొక్కాడు. అతడు రోడ్డుమీదనుండి ప్రక్కకు గూడా తప్పుకోలేదు. చేతులు, కారును ఆపమన్నట్లుగా అలాగే ఊపుతున్నాడు. మధుసూదనానికి చిరాకు వేసింది. అసలే వాన మూలకంగా ఆలస్యమయిందని అదుర్దా పడుతున్న అతడికి ఇదొక అడ్డంకి! అతడికి మరింత దగ్గరిగావచ్చి కారుకు బ్రేకు వేశాడు.

పరీక్షగా ఆ లాంతరు పట్టుకొని నిల్చొని ఉన్న వ్యక్తి ముఖంలోకి చూచాడు. వయస్సు మీరి శరీరం కొద్దిగా ముడతలు పడింది. వానకు తడిసి ముఖంమీదకు జారి నీళ్ళు కారుతున్న జుట్టు. తడిసి ముద్దయిన గుడ్డలు శరీరానికి అతుక్కుపోయి ఉన్నాయి. అతడి ముఖంలో దైన్యం కొట్టొచ్చినట్లుగా కనబడుతున్నది

మధుసూదనం విసుగ్గా ఏమిటన్నట్లుగా అతడి ముఖంలోకి చూచాడు.

అతడు డోరుప్రక్కగా వచ్చి వణుకుతున్న గొంతుకతో ఏదో అన్నాడు. కారు తలుపు అద్దాల్ని మూసి ఉండటంవలన అతడి కేమీ వినబడ లేదు. మరింత విసుగ్గా అద్దాన్ని కొద్దిగా క్రిందకు దింపాడు.

"ఏం కావాలి?" అన్నాడు అరుస్తున్నట్లు.

"బాబూ ...క్షమించాలి!" పెదిమలు వణుకుతున్నాయి. చలి తీవ్రమంటున్నది. "ఒక్క సహాయం చేయాలి!"

మధుసూదనం అప్పుడే వెలిగించిన సిగరెట్టులోని వేడిని ఆత్రంగా అనుభవిస్తూ, "నే నిప్పుడు ఏ సహాయం చేసే స్థితిలోలేను...... తప్పుకో!" అన్నాడు. చేతి వేలు 'స్టార్టర్'మీదకు జేరింది.

ఆ ముసలాయన లాంతరు ఛటుక్కున క్రిందపెట్టి రెండు చేతులూ జోడించాడు. "మీ పాదాలు పట్టుకుంటాను బాబు....ఈ ఒక్క సహాయంచేస్తే జన్మ జన్మాలకీ ఋణపడి ఉంటాను...మీరొక ప్రాణాన్ని రక్షించినవా రవుతారు!"

మధుసూదనానికి అతడి పట్ల కు కోపం వచ్చింది. కాని తమాయించుకున్నాడు. "అసలు నేనేం చేయాలి?" అన్నాడు విసురుగా.

అతడి ప్రశ్న ఆ ముసలివానికి కొంత ఊరట కలిగించింది.

"ఏమీలేదు బాబు ...మీకు పెద్ద కష్టం కాకపోవచ్చును గాని మాకు జీవన్మరణ సమస్య.... మీరొక ప్రాణిని రక్షించాలి!"

"నే నెలా రక్షించగలను...నేను డాక్టర్ను కాదే!"

"కాదు బాబు....మా చిన్నకోడలు లక్ష్మికి కాన్పు వచ్చే సమయం బాబు. మంత్రసాని 'ఫరవాలేదు, ఫరవాలేదు' అంటూనే సాయంత్రం వరకు గడిపింది....ఇప్పుడు రెండు చేతులు బారజాచి గుంటూరు పెద్ద ఆస్పత్రికి తీసుకు వెళితేతప్ప పెద్ద ప్రాణమయినా దక్క దంటున్నది... ఈ జోరున కురిసే వానలో ఆ సహా

పండిత
డి గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల ఆరోగ్యసౌభాగ్యాలకు
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 17



బాలానవ్యకమైనవి
"సులేఖ"
మరియు
"చీఫ్‌మన్"
ఫౌంటెన్‌పెన్‌లు
PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY-67.

నిద్రలో మూత్ర విసర్జన
మూత్రాశయపు మంట
35 సం. పై బడిన స్త్రీ పురుషులు మూత్రాశయపు వ్యాధులతో ఎక్కువమంది బాధపడుతుంటారు. వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు, బాధతోకూడిన మూత్రవిసర్జన, రాత్రి వేళ పగలు తరచుగా మూత్రము విడచుట, కాళ్ళ వాపులు, నిద్రలేమి, బలహీనత మొదలగు లక్షణములకు మూత్రాశయపు వ్యాధులే కారణముకావచ్చును. దరి జ్వరము గూడా తరచుగా అపాదించవచ్చును. 30 సం. నుండి యీ మూత్రాశయపు వ్యాధులకు వేలకొలది రోగులు సిస్టెక్స్ (CYSTEX)ను వాడుచున్నారు. నేడే సిస్టెక్స్ (CYSTEX)ను మీ కెమిస్టు వద్ద కొనండి. ఇది శీఘ్రముగా గుణమిచ్చును. తప్పక తృప్తినివ్వగలదు. పూర్తిగా స్వస్థత చేకూరనిచో వైద్యుని సంప్రదించవలెను.




ఏకాగ్రత

చిత్రం—పక్కి శేషగిరిరావు (విజయనగరం)

యం మీరుతప్ప మరెవ్వరూ చేయలేరు...."

ఆయన గొంతు దీనంగా ఉన్నది.

"నేను అంతకంటే ఆదుర్దా పనిమీద వెళుతున్నాను.... నేను ఏమాత్రం ఆలస్యంగా వెళ్ళినా నా హృదయంతో సమానమైన మరొక ప్రాణాన్ని చూస్తానో, లేదో అని అనుమానంగా ఉంది....క్షమించాలి....ఈ సమయంలో మీకు సహాయం చేయలేనందుకు... వెనుక వచ్చే కారును ప్రయత్నించండి... మరో కప్పుడైనట్లయితే...."

అతడి మాట పూర్తి కానేలేదు...."మీరు అలా అనగూడదు....దాని బాధ నేను చూడలేకుండా ఉన్నాను ..గంట పట్టి వానలో ఈలాగే వణుకుతూ నిలబడి ఉన్నాను... ఆపద్బాంధవులలా మీరే కనబడ్డారు బాబు....ఈ అర్ధరాత్రి ఈ సమయంలో భయంకర వాతావరణంలో మరొక కారు వస్తుందని నే నెలా ఆశిస్తాను బాబూ?"

"క్షమించాలి మీరు...అడ్డు లేవండి!" అన్నాడు మధుసూదనం. కారు స్టార్టు చేశాడు —తనకు హడావుడిగా తిరుగుతున్న నర్సుల మధ్య అచేతనంగా పడుకొని ఉన్న విమల కనబడుతున్నది.

"చూస్తూ చూస్తూ ఒక నిండు ప్రాణం గిలగిలా కొట్టుకుంటూ చనిపోతుంటే నిర్జీవంగా నే నెలా ఊరుకోగలను బాబూ?...ఆ దృశ్యం నేను చూడలేను...అంతకంటే నేనిక్కడే

# ఆ రోజు...రాత్రి...

రోడ్డు కడ్డంగా పడుకుంటాను....ఆ కారే నా మీదగా పోనీయండి" అంటూనే అక్కడే చతికిల పడ్డాడు.

వాన కురుస్తున్నా నిర్లక్ష్యంచేసి కోపంతో చిందులు త్రొక్కుతూ తలుపు తీసుకొని దిగాడు మధుసూదనం. ఆ జివ్వుమనే చలిలో గూడా కళ్ళు ఎర్రబడినాయి. "ఏమిటీ దౌర్జన్యం? ముందు అడ్డులే!"

"మీ రెంత పెద్ద మాటలైనా ఉపయోగించండి బాబు....నన్ను ఏదైనా అనండి...నేను ఎప్పుడూ వినని మాటలను గూడా విని సహిస్తాను.....నేనొక దారి దోపిడీ దొంగను....హంతకుడిని.... గూండాని....ఏదైనా అనండి...... ఏదైనా సరే.....మీ రీ సహాయం తప్పక చేయాలి. నా కేమాత్రం మరొక ఆసరా దొరుకుతుం దనుకున్నా మిమ్మల్ని ఇంతగా ఇబ్బంది పెట్టేవాడిని గాదు...!"

అతడు నీరు పారుతున్న ఆ రోడ్డుమీద కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

మధుసూదనం అచేతనంగా అలాగే నిలబడి పోయాడు. ఆ ముసలిమనిషి మొండిపట్టుదలతో ప్రాణానికైనా తెగించేందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఒక్కసారిగా అసహాయంగా చూస్తున్న విమల తన కళ్ళముందు కదిలింది గుండె దిగులుతో కొట్టుకుంటున్నది. కోపంగా, తీక్షణంగా ఆ ముసలివాని ముఖంలోకి చూడటానికి ప్రయత్నించాడు....కాని....కాని....ఆ ముడతలు పడిన ముఖంలో నీరు కారుతూ పీక్కుపోయిఉన్న ఆ కళ్ళల్లో ప్రతిబింబించే దీనత్వం అతణ్ణి వివశుణ్ణి చేస్తున్నది. ఆ హరికేన్‌లాంతరుకాంతి సాయంసమయంలో సూర్యుడిని మ్రింగిన ఆకాశంలా ఉంది.

గుండె దిటవు చేసుకొని, "మీ ఇల్లు ఎక్కడ?" అన్నాడు.

ముసలాయన ఒక్క ఉదుటున లేచాడు. "మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను బాబు!" అన్నాడు. అంటూనే చీకట్లో లీలగా కనబడుతున్న ఇళ్ళవైపు చూపిస్తూ, "ఇక్కడే బాబు! చాలా దగ్గరే!" అన్నాడు.

"ఊఁ...అయితే కారులో వెనుక ఎక్కు!"

"ఎందుకు బాబు....నేను ముందు నడిచి ఇల్లు చూపిస్తాను....మీరు కారులో రండి!"

కారు జర్రున జారే మట్టిరోడ్ల మీదుగా నడిచి ఒక పెద్ద లోగిలి ముందు ఆగింది. ఆ ఇంటి మండువా ముందంతా ఖాళీ స్థలం కావడంతో కారును పెంకుటి పంచ ముందుకు పోనిచ్చి అడ్డంగా త్రిప్పి నిలబెట్టాడు మధుసూదనం.

రెండు నిమిషాలల్లోనే ముసలాయన లోపలికి వెళ్ళి మరొకరి సహాయంతో అమితంగా మూలుగుతున్న ఒక స్త్రీని మంచంమీద పడుకోబెట్టి తీసుకువచ్చాడు. మధుసూదనం వెనుక తలుపుతీసి పట్టుకొని నిలబడ్డాడు. ఆ స్త్రీని తీసుకువచ్చిన ఇద్దరు ఆమెను చిన్నగా వెనుక సీటుమీద పడుకోబెట్టారు. ఒక స్త్రీ వెనుకగా వెళ్ళి క్రింద కూర్చుంది.

ముసలాయన గూడా త్వరత్వరగా గుడ్డలు మార్చుకొని వచ్చి ముందు సీట్లో మధుసూదనం ప్రక్కగా కూర్చున్నాడు. తిరిగి ఆ కారు కొద్ది నిమిషాలల్లోనే సిమెంటు రోడ్డు ఎక్కింది.

ఆ కారు గుంటూరు రావటానికి దాదాపు అరగంట పట్టింది. ఆ అరగంటలోను కొన్ని వందలసార్లు ఆ ముసలాయన మధుసూదనానికి నమస్కరించాడు. ఆయన మాటల్లో ఎన్నోసార్లు మధుసూదనాన్ని "ఆపద్బాంధవుడిగా, దేవుడిగా, మంచివాడుగా, దైవాంశ సంభూతుడిగా," అభివర్ణించాడు. స్తుతించాడు- అతడి మాటలకు, మనస్సును నలిపివేసే రోదనంతో గూడిన ఆమె మూలుగుకు మధుసూదనం తల దిమ్మెక్కింది. ఒకటి రెండుసార్లు విసుగ్గా అతడివైపు చూచాడు గూడా....వాళ్ళ నడతతో తనని విమలనుండి దూరం చేస్తున్నందుకు గాను!

(తరువాయి 43 వ పేజీలో)



మధురభావన

చిత్రం-పీరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

# ఆ రోజు...రాత్రి...

( 8 వ పేజి తరువాయి)

ఆస్పత్రి గేటునుంచి కారు రయ్యిన దూసుకుపోయి, "క్యాజువాలిటీ" ముందు ఆగింది. మధుసూదనం లోపలికి వెళ్ళి డాక్టరుతో చెప్పి వచ్చాడు. మరుక్షణంలోనే ఇద్దరు 'వార్డు బాయ్'లు స్ట్రెచర్‌ను తీసుకువచ్చి వెనుక సీట్లో పడుకొనిఉన్న ఆమెను దానిమీద పడుకోబెట్టుకొని తీసుకొని వెళ్ళారు.

మధుసూదనం తిరిగి కారులో కూర్చోబోతుండగా, సాష్టాంగ దండప్రణామం చేసినంత పనిచేసి కృతజ్ఞతను వెల్లడిచేశాడు ఆ ముసలాయన. మధుసూదనం తలుపు బలంగా మూసి స్టార్టర్ నొక్కాడు.

కాని ఇంతలోనే ఆ ముసలాయన తన చేతిని లోపలికి చాచాడు. ఆ చేతిలో రెండు పది రూపాయల నోట్లు కటకటాల వెనుక ఖైదీలా విల విల లాడుతున్నాయి.

"తీసుకోండి బాబు!" అన్నాడు.

మధుసూదనం విసురుగా ఆ చేతిని బయటకు నెట్టాడు. ఆ ముసలాయన తేరుకొని కళ్ళు తెరిచి చూచేటప్పటికి కారు కనుమరుగయింది!

మధుసూధనం తన బావగారి నర్సింగ్ హోంకు వెళ్ళాడు, విమల నూరు విధాల అక్కడే ఉండవచ్చనే ఆశతో. దానికి తోడు ఇంటికి వెళ్ళాలన్నా అటే వెళ్ళాలి.

అనుకున్నట్లుగానే అయింది. 'నర్సింగ్ హోం' పోర్టికోలో కారు ఆ గేటువ్వటికి దూరాన హాలులో కుర్చీలో కూర్చొనిఉన్న మామగారు పరుగెత్తుకుంటూ వచ్చారు.

ఆయన తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, హడావుడిగా దిగుతున్న మధుసూదనం ముఖంలోకి చూస్తూ, "అదృష్టవంతులం మధుసూదనం... విమల గండం గడిచి బయటపడింది!" అన్నారు.

మధుసూదనం ఆ మాట వినటంతోనే ఒక్కసారి భారంగా శ్వాస పీల్చి వదిలాడు. మనస్సు తేలికయింది....హుషారుగా దబ దబా మెట్లెక్కాడు.

"విమల నిద్రపోతున్నదా?"

"ఇంకా మత్తునుంచి పూర్తిగా తేరుకోలేదనుకుంటాను....కాని మధు...." అన్నారు ఆయన ముఖం ప్రక్కకు తిప్పుకుంటూ.

"ఏమిటి మా వగారు......ఏమైంది?"

"ఏమీలేదు మధు......పిల్లవాడు మాత్రం చచ్చి పుట్టాడు!"

మధుసూదనం ఒక్కక్షణం స్తబ్దుగా ఉండిపోయాడు. అలాగే శూన్యంలోకి చూస్తూ, "పిల్లవాడు పోయాడా?" అని తేరుకొని, "విమల కులాసాగా ఉన్నది గదా?" అంటున్నట్లుగా గొణుక్కుంటూ ముందుకు నడిచాడు.

హాలు మధ్యలో బారు లైట్లు తెల్లగా మెరుస్తున్నాయి. కాలిక్రింద పాలరాతి గచ్చులో ముఖం వికృతంగా మెలికలు తిరిగి కనిపిస్తున్నది. ఆ నర్సింగ్ హోం అంతా అతి నిశ్శబ్దంగా ఉన్నది.

అలా పోతున్న మధుసూదనాన్ని ప్రైవేటు రూంలోనుండి బయటకు వచ్చినసుందరం ఆశ్చర్య పోతున్నట్లుగా పలకరించాడు.

"హల్లో బావా! ఇదేనా రావటం? చిన్న కారులో రాలేదు గదా?"

"చిన్న కారులోనే వచ్చాను!" అన్నాడు చిరునవ్వు ముఖంమీదకు తెప్పించుకుంటూ. అతడు విమలను చూడటానికి ఆతురత పడుతున్నాడు.

"ఈ రాత్రిలో.....గాలివాన హోరులో.... చిన్న కారులోనా?...అసలు రోడ్డు బాగుందా?"

"ప్రయణాని కేంగాని, విమల కెలా ఉంది?"

అతడి ఆదుర్దాకి నవ్వు వచ్చింది సుందరానికి. సుందరం విమల పెద్దన్నయ్య. ఎం. బి. బి. యస్. పాసయి ప్రైవేటు నర్సింగ్ హోం నడుపుతున్నాడు. అతడి నెమ్మది అతడిని ఉచ్చస్థితిలోకి తీసుకురాగలిగింది. మధుసూదనాన్ని తన ప్రైవేటు రూంలోకి తీసుకువెళ్ళాడు.

"విమల కేం, మధు, కులాసాగానే ఉన్నది. పది పదిహేను రోజుల్లో పూర్తిగా కోలుకో గలుగుతుంది గూడా ..కాని...."

"నాకు తెలుసు బావా....పిల్లవాడు...పిల్లవాడు మాత్రం చచ్చి పుట్టాడు అంతేగా?" అన్నాడు. అతడి మాటల్లో నిర్లిప్తత వ్యక్తమవుతున్నది. ఆ నిర్లిప్తత అనేది 'విమల బ్రతికి బయటపడింది—అదే చాలు!' అనేందుకు నిదర్శనంగా ఉన్నది. "పోనీయ్...వాడికి మన చేతిలో పెరిగే గీత లేదు!"

"అదేగాదు బావా!" అన్నాడు. ఛటుక్కున వెనక్కు తిరిగాడు. చేతిలో పట్టుకున్న రీలింగ్ చైర్‌ను కదలకుండా పట్టుకున్నట్లుగా బిగుతుగా పట్టుకున్నాడు. నుదురు ముడతలు పడేలా ముఖం చిట్లించి ఒక చేత్తో నుదురు పట్టుకున్నాడు.

"అదిగాక....మరేమిటి?" అన్నాడు. అంటూనే మధుసూదనం సుందరం ఎదురుగ్గా పోయి అతడి రెండు బుజాలమీద చేతులు వేశాడు. ఆదుర్దాగా అతడి ముఖంలోకే చూస్తూ నిలబడి పోయాడు.

సుందరం నోటివెంట మాట పెగల్లేదు.

మధుసూదనం సుందరం బుజాలు ఊపుతూ "ఏమిటి బావా, ఏమైంది?" అన్నాడు తొట్రుపడుతూ.

"ఇక పిల్లలు కలగరు!"

"అంటే...?" అన్నాడు విచిత్రంగా మధుసూదనం.

"బావా!...ఇక విమల తల్లి కాలేదు...ఈసారి కడుపు వస్తే విమల తట్టుకోలేదని, తన ప్రాణం పోగొట్టుకోవలసి వస్తుందని ఆపరేషన్ చేయవలసి వచ్చింది.....తప్పలేదు....విమల మనకు దక్కాలంటే మరో గత్యంతరం లేదు!" సుందరం కంటిలో నీరు తిరిగింది.

ఆ మాట వింటూనే మధుసూదనం కుప్పలా ఆ రీలింగ్ చైర్‌లో కూలబడిపోయాడు!

* * * *

పది రోజులు గడిచిపోయినాయి.

విమల కోలుకుంది. కాని అసలు విషయం తెలుసుకున్న తరువాత మధుసూదనానికి తన ముఖం చూపలేకపోయింది. అమితంగా దుఃఖించింది.

"నీవు నాకు దక్కావు....చాలు విమలా! నాకు అన్నీ ఉన్నట్లే.... నాకు మరే కోరికా లేదు!" ఆమెను ఓదార్చాడు మధుసూదనం.

తన జీవితంలో జరగగూడనిది జరిగింది. మధుసూదనం మాటల్లోని ఓదార్పు ఆమెలోని ఆవేదనను తగ్గించలేకపోయింది. మాతృత్వాన్ని కోల్పోయిన స్త్రీకి ఇక ఏమి లేనట్లే!

మానసికంగా ఆమె రోజు రోజుకు క్రుంగిపోతున్నదని పసిగట్టారు అంతా. అసలు ఆ విషయం ఆమెకు తెలియనివ్వకుండా ఉంటే బాగుండేదేమో ననిపించింది. కాని జరగవలసిందేదో జరిగిపోయింది.

రాత్రి వెన్నెల నిండుగా ఉన్నది. నక్షత్రాలు విమల ముఖంలాగానే వెలా వెలా బోతున్నాయి. డాబామీద సన్నజాజుల తీగెలు గాలికి తేలిపోతున్నాయి.

మధుసూదనం ఇంటికి వచ్చాడు. కారు పోర్టికోలో పెట్టి లోపలికి వచ్చి కనుక్కుంటే విమల పైన ఉన్నదన్నారు. హుషారుగా పైకి నడిచాడు.

దూరాన విమల పిట్టగోడ వానుకొని చందమామను చూస్తూ కూర్చొని ఉన్నది. మధుసూదనం పిల్లిలాగా అడుగులో అడుగు వేసుకుంటూ విమల వెనుకగా వెళ్ళాడు. గమ్మత్తు చేయాలనే ఉబలాటంతో రెండు చేతులతో ఆమె కళ్ళు మూశాడు.

విమల ఉలిక్కి పడింది.

మధుసూదనం ఛటుక్కున రెండు చేతులు వెనక్కు తీసుకున్నాడు!

వెన్నెల్లో వెలుగుతున్న దీపపు కాంతిలో రెండు చేతులు చూచుకున్నాడు—నీటితో తడిసి మెరుస్తున్నాయి.

బాధగా, దూరంగా నడిచి క్రిందకు చూస్తూ నిలబడ్డాడు. అతడి వెనుక బరువైన పాదాల సవ్వడి విన పడింది. అది క్షణ క్షణానికి దగ్గరయి ఆగిపోయింది.

చూపు మార్చకుండానే, "అయితే ఇక్కడ ఒంటరిగా కూర్చొని నీవు చేస్తున్న పని యిదన్నమాట!" అన్నాడు.

"లేదు...లేదు...ఇక ఎప్పుడూ మీ కిలా కనబడటానికి ప్రయత్నించను...." అంటూనే పరుగెత్తుతున్నట్లుగా క్రిందకు వెళ్ళిపోయింది.

ఆమె పోతున్నవైపే విచలితుడయి చూస్తూ నిలబడిపోయాడు మధుసూదనం.

*    *    *    *

రాత్రి భోజనంచేసి పడుకుంటే ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సంతా పాడయిపోయింది మధుసూదనానికి. అకస్మాత్తుగా ఆ రోజు రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. ఆ దృశ్యమంతా కళ్ళముందు మెదిలింది. జీవితంలో భయంకరంగా పోరాడుతున్న ఆ ముసలివాని కూతురు జాలిగా తనవంక చూచినట్లయింది. ఎందుకో ఒళ్ళంతా చెమట పట్టింది. లేచి కూర్చొని వడివడిగా సిగరెట్టు తీసుకొని వెలిగించాడు....ఆమె గతి ఏమై ఉంటుంది?

నిజంగా స్త్రీని మృత్యుద్వారానికి అతి సమీపంగా తీసుకువెళ్ళే క్షణాలు అవి!

ఒక్కసారివెళ్ళిచూచిరావా లనిపించింది. అసలు నిజంగా విమలతో గూడిన ఆదుర్దాతో ఆ ముసలివానిముందు తను చాలా మూర్ఖంగా ప్రవర్తించాడు.....అప్పటి తన తీరుకు యిప్పుడు సిగ్గు వేస్తున్నది!

ఏది ఏమైనా తనవలన ఒక జీవి రక్షింపబడిందంటే అంతకంటే ఆనందం లేదు!

విమల పైకి వచ్చింది. మధుసూదనం ముఖంలోకి చూస్తూ చిన్నగా నవ్వి వెళ్ళి దూరంగా ఉన్న కుర్చీలో కూర్చొని ఏదో పుస్తకంలో నిమగ్నురాలైపోయింది.

మధుసూదనం నిట్టూర్పు విడిచి అటు తిరిగి పడుకున్నాడు.

మరునా డుదయాన్నే కారు తీసుకొని అస్పత్రికి బయలుదేరాడు. పది రోజులబట్టి వాళ్ళ విషయం పూర్తిగా మరిచిపోయాడు. కాని రాత్రి గుర్తుకు వచ్చినప్పటినుంచి మనస్సంతా కలుషితమయింది. ఎప్పుడు చూద్దామా అనే ఆదుర్దా హెచ్చింది.

ఆస్పత్రి గేటుదాటి లోపలికెళ్ళి, 'క్యాజుయాలిటీ' ముందు కారు దిగాడు. అప్పుడుగాని అతడికి తెలియలేదు...అంత పెద్ద ఆసుపత్రిలో వాళ్ళెక్కడుండేది, ఎలా కనుక్కోవటమా అని!

వాళ్ళది ఏ ఊరైందీ తనకు తెలియదు. అది గుంటూరు— హైదరాబాదు రోడ్డుమీద ఊళ్ళలో ఒక ఊరు....ఆ స్త్రీ పేరు తెలియదు. కనీసం ఆ ముసలాయన పేరు గూడా!

'మెటర్నిటీ వార్డు' ఎక్కడుందో కనుక్కొని అటు నడిచాడు. మూడంతస్థుల్లో ఉన్న ఆ వార్డును నాలుగుసార్లు అటూ యిటూ తిరిగి చూచాడు. కాని ఫలితం శూన్యమయింది.

వాళ్ళ ఊరి పేరయినా తెలుసుకోనందుకు చాలా విచారం కలిగింది.

ఎంతో ఆశగా, ఆదుర్దాగా వచ్చిన అతడికి పూర్తిగా నిరాశ ఏర్పడింది. 'క్యాజుయాల్టీ'లోనైనా కనుక్కుందామని లోపలికి వెళ్ళాడు. అక్కడయినా ఏమని అడగాలో అర్థం కాలేదు. తారీఖు చెప్పి చూద్దామనుకున్నాడు.

డ్యూటీలోఉన్న డాక్టరు నవ్వి, "ఆ రోజు రాత్రి ఆరుగురు స్త్రీలను కాన్పుల వార్డులో చేర్చాం! పేరు తెలియకుండా ఎక్కడ ఎట్లా ఉన్నారో ఎలా చెప్పగలం?" అన్నాడు.

"పోనీయండి! అంతా కులాసాగానైనా ఉన్నారు గదా?"

అతడు ఏవేవో రికార్డులు తిరగవేశాడు.

"లేదు! నలుగురు మాత్రం సుఖంగా ప్రసవించారు. మిగతా యిద్దరిలో ఒకామెకు పుట్టిన పిల్ల మరునాడే చనిపోయింది....మరొక స్త్రీకి పుట్టిన పిల్లవాడు మాత్రం సుఖంగా ఉన్నాడు—ఆమె మరణించింది!"

మధుసూదనానికి తల తిరిగిపోయింది. కారులో కూలబడి ఇంటికి జేరాడు!

*    *    *    *

విమల కాలం గడిచినా, మానసికంగా ఏమాత్రం కోలుకోలేకపోయింది. అప్పటికే ఆ దురదృష్టపు సంఘటన జరిగి కొన్ని నెలలయింది.

మధుసూదనం మామగారితో చెప్పాడు: "మేము రెండు మూడు నెలలపాటు నాలుగు ప్రదేశాలు చూచివద్దామని ఉన్నది...అలా తిరగటంవలననయినా విమల తన మనస్సును విచారానికి దూరం చేసుకోగలుగుతుందేమోనని నా ఆశ!"

ఆయనా, "ప్రయత్నించు!" అన్నారు. మధుసూదనం బావ సుందరం గూడా, "ఫలితం ఉండవచ్చేమో?" అన్నాడు.

విమలకు తన అభిప్రాయం తెలిపినప్పుడు


# నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు. ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదవుషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

ఇండియన్ మెడిసన్‌హౌస్.

విజయవాడ—2.

## నారసింహ లేహ్యం

బంగారు చేరినది. మేహము, నిస్త్రాణ, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.

20 తు డబ్బీ రు. 3—8—0.

## రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజీ రు.1-1-0.

మా క్యాటలాగు, కాలండరు ఉచితం.

పి. సి. ఏ. అండ్‌కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

## శ్రీ యోగాశ్రమము
## పెదవాల్తేరు
### విశాఖపట్టణము-3.

☞ డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్సచేయబడును. కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానములేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును.

మధుసూదనానికి ఆమె సమాధానం ద్విగుణీకృత ఉత్సాహాన్ని కలిగించింది. "ఇక్కడ కూర్చొని లేనిపోని ఆలోచనలతో మనస్సు పాడు చేసుకునే దానికంటే అదే మంచిదేమో?" అన్నది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"అయితే ముందు హైదరాబాదు వెళ్ళుదాం.. ఆ రాత్రి టెలిగ్రాం చూసుకొని ఎక్కడి వక్కడ వదిలి తలుపు తాళంవేసి వచ్చాను....ఇంటి దగ్గరికి వెళ్ళి ఒకసారి చూచివెళ్దాం....ఎలాగైనా కంపెనీకి వెళ్ళి సెలవుపెట్టి వస్తే బాగుంటుంది!"

ఐదారు రోజుల తరువాత ఒక రోజు మధుసూదనం విమలను తీసుకొని హైదరాబాదుకు బయలుదేరాడు.

"ముందు కూర్చో!" అన్నాడు.

"చల్లగాలి కొడుతూంది....అద్దాలు మూసి వెనుక కూర్చుంటాను!....అంటూ వెనుకనే కూర్చుంది.

కారు బయల్దేరి గుంటూరు హైదరాబాదు రోడ్డు ఎక్కింది.

గుంటూరు దాటి నిర్జన ప్రదేశంలోని రహదారిమీదకు కారు చేరినప్పుడు తిరిగి మధుసూదనం మనస్సులో ఆ రాత్రి సంఘటన మెదిలింది....మనస్సు తనకు తెలియకుండానే ఆదుర్దా పడింది.

వరుసగా రాబోయే గ్రామాలలో వారిది ఏ వూరని తను తెలుసుకోగలడు?

ఆ సంఘటనంతా విమలకు చెబితే కాస్త మనస్సుకు ఊరటయినా కలుగుతుందేమో ననిపించింది. కాని అదే ఆమెలో మరింత అశాంతికి కారణమైతే తాను తట్టుకోలేడు!

లేయెండలో రోడ్లు వెచ్చదనాన్ని పొందటానికి తాపత్రయ పడుతున్నాయి. ముడుచుకుపోయిన చెట్ల ఆకులు ఒళ్ళు విరుచుకొని తెరుచుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.

మధుసూదనం సిగిరెట్టు వెలిగించి రోడ్డు వంకే తదేకంగా చూస్తూ స్టీరింగ్ త్రిప్పుతున్నాడు. విమల మౌనంగా వెనుక ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చుంది.

కారుకు కనుమరుగవుతున్న చింతచెట్లు వెనక్కు పరుగెడుతున్నాయి. కారు నిశ్శబ్దంగా పారుతున్న నీటితో నిండిన ఒక వంతెన దాటింది. అలా దాటిందో లేదో మధుసూదనం 'సడన్'గా బ్రేకువేసి త్వరత్వరగా దిగి వెనుదిరిగి చూచాడు.

సరిగ్గా ఆ రోజు రాత్రి ఈ వంతెన దాటిన తరువాతే ఒక మలుపువచ్చింది. ఆ మలుపు తిరుగుతూనే దూరంగా ఆ వానలో తడిసి ముద్దవుతూ నిలబడిఉన్న ఆ ముసలా యన్ను చూచి తాను ఆశ్చర్యపోయాడు.

తిరిగి కారులో కూర్చున్నాడు. స్టార్టుచేసి వెనక్కు తిప్పాడు. విమానంలా కారు ముందుకు దూసుకుపోయి అతడు ముందుగానే ఊహించిన ఆ మలుపు తిరిగింది. ఆదుర్దాగా కళ్ళెత్తి దూరంగా రోడ్డుప్రక్కగా చూచాడు. అతడి కళ్ళు మెరిసినాయి. అక్కడ ఒక గ్రామమున్నది. తప్పక అదే తనకు కావలసిన గ్రామం అయి ఉండాలి!

మధుసూదనం ప్రవర్తనకు విమల ఆశ్చర్యపోయింది.

"ఏమిటి? ఏమైంది? వెనక్కు త్రిప్పుతున్నారెందుకు?" అంది ఆదుర్దాగా.

మధుసూదనం వెనుదిరిగి ఒక్కసారి విమల ముఖంలోకి చూచి, తిరిగి కళ్ళను రోడ్డుమీద కేంద్రీకృతం చేశాడు.

"ఆ రోజు రాత్రి....!" ఒక్క క్షణమాగాడు.

"ఆ రోజు రాత్రి.....?" విమల ముందుకు వంగింది.

"ఆ అర్ధరాత్రి కటిక చీకటిలో, భయంకర వాతావరణంలో, మరొక జీవిని వెలుగులోకి తీసుకు వచ్చే ప్రయత్నంలో, మరణంతో పోరాడుతున్న ఒక స్త్రీని ఆ గ్రామంనుండి నా కారులో గుంటూరు ఆసుపత్రికి తీసుకువెళ్ళి చేర్చాను... తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు.... ఎందుకో ఆ విషయం తెలుసుకోవాలనిపిస్తున్నది. ఆమె సుఖంగా ప్రసవించి ఉంటుందనే అనుకుంటున్నాను!"

విమల క్షణం అప్రతిభురాలై అలాగే చూస్తూ ఉండిపోయింది.

కారు ఆ యిళ్ళ దగ్గరికి వెళ్ళినతరువాత ఆపాడు. దిగి తను ఆ రోజు రాత్రి వెళ్ళిన సందు కోసం చీకట్లోకి చూచినట్టుగా కళ్ళు పెద్దవి చేసుకొని చూచాడు. తిరిగి కారులో ఎక్కి అనుమానంగా ఉన్న ఒక సందులోకి త్రిప్పాడు.

ఖాళీ స్థలంఉన్న ఆ పెద్ద మండువా యిల్లు చూచినప్పుడు మధుసూదనానికి ఏదో తెలియని ఆనందం కలిగింది. కళ్ళు మిలమిలా మెరిసినాయి.

వాకిట్లోనే కూర్చొనిఉన్న ఆ ముసలాయన కారు దిగుతున్న మధుసూదనాన్ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. మళ్ళా ఒక రోజు అలా తన యింటికి అతడు వస్తాడని ఎప్పుడూ ఊహించలేదు!

వడివడిగా లేచి కారువద్దకు వస్తూ, "రండి బాబు! రండి!" అన్నాడు.

మధుసూదనం ముందు తలుపు మూసి, "దిగు విమలా! చూచివెళ్దాం" అన్నాడు వెనుక తలుపు తెరుస్తూ.

ఆ ముసలాయన ముందుగా వరండాలోకి నడిచి మంచం వాల్చాడు.

విమల తల వంచుకొని మధుసూదనాన్ని అనుసరించింది.

మధుసూదనం వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు. విమల దూరంగా ఉన్న చాపమీద కూర్చుంది.

"మీ కోడలు కులాసాగా ప్రసవించింది గదా?" ఉత్సాహంగా అడిగాడు మధుసూదనం.

ఆ ప్రశ్న వినటంతోనే ముసలాయన ముఖం వివర్ణమయింది. తల చటుక్కున వాల్చు


డాక్టర్ వృత్తి చేయండి!



ఇంటిలో విరామంగా కూర్చొని ఉండేప్పుడు పోస్టల్ ట్యూషన్ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిస్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

INDIAN HOMOEOPATHIC COLLEGE
(A.W.P.) JULLUNDUR CITY

మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- ...... రూ 3-50.
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు ...... రూ 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు ...... రూ. 3-50.
అమ్మక రహస్యాలు:- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ. 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను-గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50.
పోస్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి.పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర

మంచి రహస్యం

గ్లోరియా ద్రవాన్ని మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును. ముఖంలో ముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును. ఎండకువచ్చే నలుపును, మొటిమలను నిమ్మళంగా పోగొట్టును. వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును.


JANITA PRODUCTS, ELURU. A.P.




ఐ టెక్స్
(కాటుక)
శాస్త్రీయంగా తయారైనది.
అరవింద్
బింది
కుంకుమ చాదు
6 ఆకర్షణీయమైన రంగులలో లభించుచున్నవి.

అరవింద్ లేబరేటరీస్
పి. బి. 1415, మద్రాసు-17.

తెలంగాణా జిల్లాలకూ హైదరాబాదుకూ మినహా ఆంధ్రప్రదేశ్కు ఏజెంట్లు:
ప్రగతి ఏజెన్సీస్
పులిపాటివారి వీధి, విజయవాడ-1.



సాంచీస్తూపం తూర్పుద్వారం ఫోటో—శి. శ్రీరామమూర్తి (సికిందరాబాదు)

కున్నాడు. అతడిని చిన్న చూపు చూస్తున్నట్లుగా కంటవెంట నీరు జలజలా కారింది.

"ఏమైంది....ఎందుకలా బాధపడుతున్నారు?" అన్నాడు లేచి నిలబడుతూ మధుసూదనం.

ఆ ముసలాయన ముఖమెత్తి మధుసూదనం కళ్ళల్లోకి చూస్తూ, "ఇంకెక్కడి లక్ష్మి బాబూ! ఆ నరకయాతన అనుభవించి, అనుభవించి పండంటి పిల్లవాడిని భూమిమీద పడేసి కన్ను మూసింది!" అని చేతులతో ముఖం కప్పుకున్నాడు. "ఇక లక్ష్మి లేదు బాబూ. ... లేదు... ఈ జీవితంలో పొందలేని శాంతిని పొందేందుకై వెళ్ళిపోయింది!"

మధుసూదనం, విమల ఇద్దరూ నిర్విణ్ణులయ్యారు అతడి మాటలకు.

క్షణాలు భారంగా గడిచిపోతున్నాయి.

మధుసూదనం అలాగే పిచ్చిగా చూస్తున్నాడు.

"చంద్రం ఏనాడైతే ఇంట్లో చెప్పకుండా లేచిపోయాడో, ఆ రోజే అది మానసికంగా మరణించింది. ఆ తరువాత జీవంలేని జీవితాన్నే మామధ్య గడిపింది!"

"చంద్రం ఎవరు?" అన్నాడు తేరుకొని మధుసూదనం.

"దాని మొగుడు...... నా చిన్న కొడుకు!" ముసలాయన తలెత్తలేదు. "అది అనుభవించిన ఆనందం జీవితంలో అతి స్వల్పం. ఆరు నెలల క్రితం చంద్రం ఒక రోజు రాత్రి చెప్పకుండా యింతకంటే సుఖాన్నిచ్చే ప్రదేశంలో కాలు పెట్టటానికి పారిపోయాడు...! అప్పటికే లక్ష్మి గర్భవతి...."

మధుసూదనం మౌనంగా కూర్చున్నాడు. వెనుక ఏదో ఏదో తలుపు చప్పుడయింది. విమల తలతిప్పి చూచింది.... ఎవరో తలుపు వేసుకొని వెళ్ళిపోతున్నారు..

## ఆరోజు...రాత్రి...

"వాళ్ళు అంతేనమ్మా! అంతే! మనుష్యులు కారు, మర్యాద తెలియని పశువులు ... లక్ష్మి మరణానికి వాళ్ళే కారకులు. బ్రతికున్నంతకాలం నలుచుకు తిన్నారు. చంద్రం లేచిపోయిన తరువాత మరీ ...డబ్బున్న పెద్ద కోడళ్ళమ్మా వాళ్ళంతా.....డబ్బున్నవాళ్ళు.... బీద లక్ష్మిఅంటే పురుగులా చూచేవాళ్ళు...అది గట్టెక్కింది......ఇప్పుడయినా శాంతి అనుభవిస్తూ ఉండాలి!" ఆయన కళ్ళు అద్దుకున్నాడు పంచె కొంగుతో.

విమల ముసలాయన వంకే తదేకంగా చూడసాగింది.

"ఇక ఏలాగూ ఆ పి[illegible]గాణ్ణి ఇక్కడ నిలవనీయరు...వాణ్ణి తీసుకువెళ్ళి ఒక అనాథుడిగా, నే నుండగానే ఏదైనా ఆశ్రమంలో చేరుస్తాను... వాడిని బ్రతకనీయరు వాళ్ళు!"

మధుసూదనం చటుక్కున లేచాడు. "ఏమంటున్నారు మీరు?"

ముసలాయన తలెత్తాడు. నీటి పొరలతో నిండిన కళ్ళతో మధుసూదనం వంకే చూస్తూ, "వాడినైనా ఈ నరక కూపంనుంచి రక్షిద్దామనుకుంటున్నాను.... తమకు రాబోయే ఆస్తిలో ఒక భాగస్తుణ్ణి చేయటానికి వాడినెలా పెంచుతారో మీకు తెలియదు బాబు!"

ముసలాయన లేచి నిలబడ్డాడు.

"మీ చిన్న కొడుకు రాడని నమ్మకమేమిటి" అన్నాడు మధుసూదనం. అతడి కళ్ళల్లో తూర్పున సూర్యోదయ మవుతున్నట్లుగా, ఏదో నూతన కాంతి వెలుగుతున్నది.....ఆలోచనలు మనిషిని ఎక్కడెక్కడో తిప్పుతున్నాయి.

"వాడు రావటం కల్ల బాబు ...అసలే మొండిమనిషి....రాడు!"

"ఒక్కసారి పిల్లవాడిని చూపిస్తారా?"

విమల మనస్సు గూడా ఆ పిల్లవాడిని చూడటానికి తాపత్రయపడుతున్నది.

ముగ్గురు ఆ యింటికి ఒక ప్రక్కగానున్న గదివైపు నడిచారు.

ముసలాయన ముందుగా మసకగా ఉన్న ఆ గదిలోకి వెళ్ళి కిటికీ తలుపులు పూర్తిగా తెరిచాడు. ఆ గదంతా తుక్కు, ధూళితో అసహ్యంగా ఉన్నది. ఒక మూల పాత సామాను కుప్పగా పోసిఉంది. గోడలు దుమ్ముతో నిండి వికృతంగా ఉన్నాయి.

"చూడు బాబు......కడుపులో పడగానే తండ్రిని దేశాంపాలు చేశాడని, భూమ్మీద పడుతూనే తల్లిని మింగేశాడని, వాడి ముఖం చూడటానికైనా ఇష్టపడకుండా ఈ మూల గదిలో పడేశారు!"

మధుసూదనం, విమల ఆత్రంగా మంచం మీద పాత గుడ్డల్లో పడుకొని నిద్రపోతున్న పిల్లవాడిని చూడటానికి వంగారు.

ఎర్రగా బొద్దుగాఉన్న అందమైన ఆ పిల్లవాడు ముద్దొస్తున్నాడు. విమల ప్రేమగా, జాలిగా బుగ్గలు నిమిరింది. అంత ముద్దొచ్చే పిల్లవాడిని ద్వేషించటానికి వాళ్ళ మనస్సు లెలా ఒప్పుకున్నయ్యో విమలకు అర్థం కాలేదు.

మధుసూదనం విమల కళ్ళల్లోకి చూస్తూ ఎన్నో సందేశాలు అందిచ్చాడు.

"ఆ పిల్లవాడిని ఏలాగూ ఎక్కడికైనా పంపిద్దామనుకుంటున్నారు కాబట్టి....మాకే పెంచుకోవటానికి మీ రెందుకు యివ్వగూడదు?"

ముసలాయన నోటినుండి వెలువడే మాటలు వినటానికి మధుసూదనం మనస్సు ఆత్రుత చెందింది. శ్వాస బిగపట్టుకొని నిలబడ్డాడు.

విమల మనస్సు మధుసూదనం మాటలకు ప్రఫుల్లమయింది. నిద్రపోతున్న పిల్లవాడినే ఎత్తుకోవటానికి ప్రయత్నించ సాగింది, ఆమె!

ముసలాయన అతడి మాటలు విని ఆశ్చర్యపోయాడు. నోటమాట పెగల్లేదు. కొన్ని క్షణాల తరువాత తేరుకొని, "అంతకంటేనా బాబు!" అన్నాడు.

* * * *

ఆ పిల్లవాడిని చూడటానికే నేను మధుసూదనం వాళ్ళింటికి వెళుతున్నానంటే మీ రెంతమంది నమ్మగలుగుతారు? మీరు నమ్మినా నమ్మకపోయినా అందుకోసరమే వెళుతున్న మాట మాత్రం నిజం. ఇక వెళతాను గూడా. నేను దేశద్రిమ్మరిగా తిరిగి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత మానాన్న చెప్పిన కథ, ఇప్పుడు మధుసూదనం చెప్పిన కథ విని గూడా ఆ పసిపాపడిని చూడకుండా ఎలా ఉండగలను? ★